క్లుప్తంగా

పనుల పరిశీలన



ఖానాపురం : గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న బీటీ రోడ్లను నాణ్యతతో చేపట్టాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని బుధరావుపేట నుంచి ధర్మారావుపేట వరకు జరుగుతున్న బీటీ రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యత లోపంతో చేపడితే బిల్లులు నిలిపి వేయించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మణితేజ, పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి రూ.70 లక్షల విలువ గల సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారని సర్పంచ్ కుండె మల్లయ్య, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు ఎండి.రఫీ, మాజీ జెడ్పీటీసీ జున్నుతుల రాంరెడ్డి, నాయకులు కంది కృష్ణ చైతన్య రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ జంగిలి రాజు, నాయకులు సాధు నర్సింగ రావు, కుసుమ నరేందర్, కందిక సునీల్, యాకుబ్, సాగర్, జంగిలి కిరణ్, సారంగం, రమేశ్, ఐలయ్య, అనిల్, సుదర్శన్, రాములు, రాజు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

చెన్నారావుపేట : చెన్నారావుపేట పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా లక్ష్మణమూర్తి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఐనవోలు పీఎస్ నుంచి ఆయన బదిలీపై చెన్నారావుపేటకు వచ్చారు.



లక్ష్మణమూర్తి

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



గీసుకొండ : గీసుకొండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సట్ల రాజును ఆదివారం మర్యాద పూర్వకంగా కలవడానికి పలు పార్టీల నాయకులు స్టేషన్‌కు తరలివచ్చారు. అధికార బీఆర్ఎస్ పార్టీతో పాటు ఎమ్మార్పీఎస్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు తరలిరావడంతో పోలీస్‌స్టేషన్‌లో సందడి నెలకొంది. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, సర్పంచ్‌లు గోనె మల్లారెడ్డి, పూండ్రు జయపాల్‌రెడ్డి, నాయకులు ముంత రాజయ్య, కొల్పుల కట్టయ్య, డోలె చిన్ని, లెనిన్‌గౌడ్, పూర్ణచందర్, కోట ప్రమోద్, శిరిసె శ్రీకాంత్, నాయిని భరత్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఇన్‌స్పెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సన్మానించారు.

చెక్కు అందజేత

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాలకు చెందిన చింత రాజుగౌడ్ ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. మంచానికే పరిమితం కాగా బీసీ సంక్షేమ శాఖ నుంచి విడుదలైన రూ.16వేల చెక్కును నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రాజు కుమారుడికి అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ జనహక్కుల పోరాట సమితి, మోకు దెబ్బ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోడిశాల సదానందం తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన జక్కుల యాదగిరి(101) అనే శతాధిక వృద్ధుడు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు, కోడలు, మనుమరాలు ఉన్నారు. ఈ సందర్భంగా సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, హెచ్ఎం కర్ణాకర్‌రెడ్డి, రాజోజు రవీందర్, మేడి రమేష్‌గౌడ్, వల్ల వేణు, ప్రదీప్, బద్రు, విష్ణు, గణేష్, వెంకటేశ్వర్లు, నవీన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.



యాదగిరి (ఫైల్)

ఎన్నిక

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలో శ్రీ లక్ష్మీనర్సింహ ఆటోయూనియన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెల్లోజు నాగయ్య, ఉపాధ్యక్షుడిగా ముద్రబోయిన వెంకన్న, కార్యదర్శిగా పొడిశెట్టి సంతోష్, కార్యవర్గ సభ్యులుగా సీల ఎల్లారెడ్డి, గజవెల్లి రవీందర్, కుమార్, నర్సింహరాములు, రంజిత్, నర్సయ్య, బానోతు రమేష్, రాజేష్, బండి రాజు, డొంక మధు, వశపాక హరీష్‌లను ఎన్నిక చేసినట్లు తెలిపారు.

వరి.. ఎర్రబారి



ఎర్రబారి చనిపోయిన వరిపైరు

- నెలరోజులకే చనిపోతున్న నాటు
- ఆందోళనలో అన్నదాతలు

దుగ్గొండి : దేశానికి అన్నం పెట్టే రైతులు కోటి ఆశలతో వరి పంటను సాగు చేశారు. వర్షాకాలం పంట పెట్టుబడి ఎక్కువ కారణంగా పెద్దగా అన్నదాతలకు గిట్టుబాటు కాదు. యాసంగిలో వరిసాగు అన్నదాతలకు కొంత లాభదాయకంగా ఉంటుంది. అయితే ఈసారి మునుపెన్నడూ లేని విధంగా వరి నాట్లు వేసిన 15 రోజులకు చనిపోవడం మొదలైంది. ఎరుపు రంగుకు మారి క్రమంగా గడ్డిలా మారి చనిపోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో యాసంగి వరి పంట 79,630 ఎకరాలలో సాగు అవుతుంది. వరినాట్లు దాదాపుగా చివరి దశకు చేరుకున్నాయి. నాట్లు పూర్తి కాకముందే మొదట వేసిన నాట్లు చనిపోతున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వందలాది ఎకరాలలో నాట్లు చనిపోయాయి. దీంతో కొంత మంది రైతులు ఆశ చావక మళ్లీ దమ్ము చేసి నారు కొనుక్కుని వచ్చి నాట్లు వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో అన్నదాతలకు సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు జాడలేరని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాండం తొలుచు పురుగు

వరిలో ఎన్నడూ లేని విధంగా తొలినాళ్లలోనే కాండం తొలుచు పురుగులు ఆశించాయి. ఈ ప్రభావంతో వరిపాదులు ఎండిపోతున్నాయి. నివారణకు నాటు వేసిన 15రోజుల లోపు ఎకరాకు 10కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేయాలి. లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ మందు ఎకరాకు 400 గ్రాములు పిచికారీ చేయాలి. లేదా కోరాజిన్ 60 మిల్లీమీటర్ల మందును ఎకరాకు పొలానికి పిచికారీ చేయాలి.



ఈ ఫొటోలోని మహిళా రైతు మాదాసి వసంత. మండలంలోని నాచినపల్లి గ్రామం. తనకున్న 2 ఎకరాల పొలంలో నెలరోజుల క్రితం విత్తనోత్పత్తి పథకంలో భాగంగా వరినాటు వేసింది. నెల రోజులయినా పొలం పచ్చగా మారలేదు. పిలకలు రావు. రెండుసార్లు యూరియా, డీఏపీ వేసింది. అయినా పచ్చగా మారకుండా కుళ్లిపోయి మొక్కల పాదులు చనిపోతున్నాయి. రెండు ఎకరాలు నాటు వేసే వరకు తనకు రూ.50 వేల పెట్టుబడి అయింది. పంటంతా రోజు రోజుకు నాశనం అవుతుందని వసంత కన్నీటి పర్యంతం అవుతోంది. ఈ సమస్య ఒక్క వసంతదే కాదు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులది.

అన్నదాతలు అధైర్యపడొద్దు



వరికోత మిషన్‌లతో వరి కోతలు చేయడం వల్ల కొయ్యకాలు అరమీటరు ఎత్తుగా ఉండిపోతోంది. దీనివల్ల కొయ్యకాలు దమ్ము చేసినప్పుడు కుళ్లిపోకుండానే నత్రజని అందుబాటులోకి రాదు. ఫలితంగా మొక్క చనిపోతుంది.

- సంక్రాంతికి ముందు తీవ్రమైన చలి 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదు కావడం, దానికి తోడు చౌడు భూములలో మొక్కలు చనిపోతున్నాయి. చౌడు నేలలో నిరంతరం నీరు ఉండేలా చూసుకుంటే నాటు చనిపోకుండా ఉంటుంది.
- ఇటుక రంగులోకి మారడానికి గమనిస్తే జింక్ లోపంగా గుర్తించాలి. దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయని వరిపొలాలలో సమస్య తీవ్రంగా ఉంది. ప్రస్తుతం వరిలో లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి 5 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.
- చౌడు నేలలలో ఈసారి వేరుకుళ్లు ఆశించింది. వేర్లు నల్లగా మారి భూమి నుంచి పోషకాలను గ్రహించలేక వరి మొక్కలు చనిపోతున్నాయి. నివారణకు పొలానికి నీరు పెట్టడం.. ఆరబెట్టడం పద్ధతి ఆచరించాలి. పై పాటుగా 19–19–19, లేక 13–0–45 మందును లీటరు నీటికి 10 గ్రాములు కలిపి గాని లేక అగ్రోమిన్ మాక్స్ లీటరు నీటికి 5గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

- నాగభూషణం, వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం, ప్రధాన శాస్త్రవేత్త

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గీసుకొండ : గీసుకొండ జెడ్పీ ఉన్నతపాఠశాలలో 1994–95 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకొని తమ జీవిత అనుభవాలను పంచుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. అప్పటి హెచ్ఎం ఇరుకుల్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దశరథం, అనంద్‌బాబు, దేవేంద్రాచారి, రమణాచారి, నర్సింహస్వామి, ఇందిరాదేవి, సత్యనారాయణ పాల్గొనగా అతిథులుగా స్టేట్‌బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ, ఓయూ అసోసియేట్ ప్రొఫెసర్ ముత్తినేని రాధాకృష్ణ, కర్ణకంటి రాంమూర్తి, గుండా సరేశ్‌లు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

సంగెం : ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై పెండ్యాల దేవేందర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న పర్వతగిరి మండలం రోళ్లకల్ గ్రామానికి చెందిన నూనావత్ కిషన్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిక



నర్సంపేట / చెన్నారావుపేట : చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షుడు పింగిళి అశోక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన అశోక్‌కు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే ఖానాపురం మండలం దబ్బీరుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న సర్పంచ్ దంపతులు

సంగెం : మండలంలోని గవిచర్ల గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ దొనికెల రమాశ్రీనివాస్ దంపతులు భూమి పూజ నిర్వహించారు. సర్పంచ్ రమ మాట్లాడుతూ నూతన జీపీ భవనానికి రూ .50లక్షలతో చేపట్టుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, ఉప సర్పంచ్ చెన్నూరి యాకయ్య, పీఆర్ఏఈ రమేష్, పంచాయతీ కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటు అడిగే హక్కు లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నర్సంపేట : నియోజకవర్గంలోని పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కూడా ఇవ్వలేని బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు అడిగే హక్కు లేదని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 17, 22 డివిజన్లలో ఆదివారం పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించి డివిజన్ కమిటీలను నియమించారు. 22వ డివిజన్ అధ్యక్షుడిగా కోయ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గురుజాల మురళీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తొగరు దేవేందర్, సహాయ కార్యదర్శులుగా పోల్ సత్యం, మధ్యల యాదగిరి, కోశాధికారిగా బొప్ప రాతి సురేందర్, కార్యవర్గ సభ్యులు, డివిజన్ యూత్‌కమిటీ, మహిళా కమిటీ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అలాగే 17వ డివిజన్ అధ్యక్షుడిగా రాయరాకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గుర్రం పాషా, తోట సారంగం, ప్రధాన కార్యదర్శిగా గుర్రం వెంకన్న, సహాయ కార్యదర్శిగా గజ్జల రాజు, కోశాధికారిగా వంగపండ్ల రాజ్‌కుమార్, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, మాజీ వార్డు మెంబర్ ములుకల సాంబయ్య, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు మెరుగు సాంబయ్య, ఎడ్ల ప్రతాప్‌రెడ్డి, ఓబీసీ పట్టణ ఉపాధ్యక్షుడు ఓర్సు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్ తదితరులు

సంగెం : మండలంలోని రామచంద్రాపురం, లోహిత, షాపూర్ గ్రామాల్లో గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ కుటుంబానికి తోటి ఆపరేటర్లు అండగా నిలిచారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కడారి అనిత తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అనిత కుటుంబానికి కంప్యూటర్ ఆపరేటర్ల జిల్లా సంఘం సభ్యులు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సింగారపు ప్రవీణ్‌కుమార్, నాయకులు దొనికెల మనోజ్, కిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్సంపేట: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట రూరల్: శివకోటి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



నెక్కొండ: నివాళులర్పిస్తున్న రంజిత్‌రెడ్డి

నర్సంపేట : పట్టణంలోని 18వ వార్డుకు చెందిన రావుల రమ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. కాగా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే నల్లబెల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బాబర్ మృతదేహాన్ని పోస్టుమార్టం వద్ద సందర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, నల్లబెల్లి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణానికి చెందిన కొంపెల్లి శివకోటి, ద్వారకపేట గ్రామానికి చెందిన కళ్యాణ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్న రావుల రమ మృతిచెందగా ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వడ్డెపల్లి నర్సింహారావు, సంతోష్‌నాయక్, బాల్నె జగన్, కొంపెల్లి రాజు, చిలువేరు రజనీభారతి, తక్కెళ్లపల్లి ఉమాదేవి, గూడూరు సందీప్ పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాయపురపు పోశయ్య(90) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బక్కి అశోక్, లక్ష్మి, రావుల మహిపాల్‌రెడ్డి, సింగం ప్రశాంత్, లక్ష్మణ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

నడికూడ : మండలంలోని చర్లపల్లి గ్రామంలో చేపట్టిన సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను జెడ్పీటీసీ కొడెపాక సుమలతతో కలిసి ఎంపీపీ మచ్చ అనసూర్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనసూర్య మాట్లాడారు. జెడ్పీటీసీ రూ.4 లక్షలు, ఎంపీటీసీ రూ.3 లక్షలు కేటాయించగా పనులు చేపట్టినట్టు తెలిపారు. అనంతరం ఆమె ప్రాథమిక పాఠశాల ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రావుల చాడ తిరుపతిరెడ్డి,, తిప్పర్తి సాంబశివరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, గణపతిరెడ్డి, జయపాల్‌రెడ్డి, బొల్లారం అనిల్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే అరూరి రమేష్

వర్ధన్నపేట : తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రజలకు చేరువైందన్నారు. ప్రజల కష్ట సుఖాల్లో పాల్గొని వారి సమస్యలను తీర్చడంలో తాము ముందుంటామని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దమ్మన్నపేట గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. ప్రతి వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జ్ ఎప్పటికప్పుడు అప్రమత్తత ఉండాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కొత్త పాత అని లేకుండా అందరిని నాయకులు, కార్యకర్తలు కలుపుకు పోవాలని సూచించారు. ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, తూల్ల కుమారస్వామి, పూజారి రఘు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న అరూరి రమేష్

ఆలయ అభివృద్ధికి పాటుపడాలి



బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సరోజ

నెక్కొండ : ఆలయాలు మన సంస్కృతీ, సంప్రదాయాలకు నెలవని, వాటి అభివృద్ధికి ప్రతీ ఒక్కరు పాటుపడాలని సర్పంచ్ మాలోత్ సరోజ అన్నారు. మండలంలోని గొట్లకొండ శివారు అజ్మీరా మంగ్య నాయక్ తండా జీపీ పరిధిలో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణంలో భాగంగా ఆదివారం బోరు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో నడిచి, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మాలోత్ శివలాల్, ఆలయ కమిటీ చైర్మన్ మాలోత్ వెంకన్న, వైస్ చైర్మన్ మాలోత్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శివ, బోరు దాత బానోత్ శ్రీనివాస్, నాయకులు బానోత్ వీరన్న, గుగులోత్ రామచంద్ర, ఇస్లావత్ ప్రవీణ్, బానోత్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

పర్వతగిరి : మండలంలోని అన్నారం గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొనగా అర్చకులు కుంకుమ పూజా, అన్నపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లూనావత్ కమలపంతులు, జెడ్పీటీసీ బానోత్ సింగ్‌లాల్, పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్, మండల కో ఆప్షన్ సభ్యుడు షబ్బీర్‌అలీ, సర్పంచ్ యశోదబాబు, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, టీఆర్ఎస్ నాయకుడు జడల కృష్ణ, ఉపసర్పంచ్ మదన్‌మోహన్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేస్తున్న బాధ్యులు

గ్రామస్తుల సహకారంతోనే సాయం



డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న గ్రామస్తులు

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా సాంబయ్యకు భార్య భాగ్య, కుమార్తెలు జ్యోషిక, జ్యోత్స్న ఉన్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన వివిధ వృత్తులలో స్థిరపడిన వారు గ్రామం నుంచి విదేశాలలో స్థిరపడిన ఎన్ఆర్ఐలు కలిసి రూ.1లక్ష మృతుడు సాంబయ్య కుమార్తె పేరిట ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. దీనికి సంబంధించిన పత్రాలను (బుక్స్) స్థానిక సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్ రెడ్డి, దాతలు, గ్రామస్తులతో కలిసి ఆదివారం జ్యోత్స్నకు అందించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, వాట్సప్ గ్రూప్ క్రియేటర్ పులి దేవేందర్ మాట్లాడుతూ.. గ్రామస్తుల సహకారంతో కొనసాగుతున్న వాట్సప్ గ్రూప్ ద్వారా నగదు సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, దాతలు, ఊడుగుల శ్రీనివాస్, పెరుమాండ్ల సాంబరెడ్డి, కొత్వాల రాజు, కొత్తపెల్లి విజయ్, కరుణాకర్, ప్రభాకర్, స్వామి, రెడ్డబోయిన కుమార స్వామి, ఆరెల్లి శ్యామ్, రెడ్డ బోయిన కరుణాకర్, గుల్లపెల్లి స్వామి, మాడుగుల కుమారస్వామి, వట్టి రవికిరణ్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

రూ.10లక్షల ఉచిత యాక్సిడెంట్ పాలసీ

నర్సంపేట : పట్టణంలోని భారత్ డెంటల్ లేజర్ కాస్మోటిక్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యశాలకు వచ్చే ప్రతి అనారోగ్య బాధ్యులకు రూ.10లక్షల విలువ చేసే యాక్సిడెంట్ పాలసీ ఉచితంగా తప్పనిసరి చేస్తున్నట్లు డాక్టర్ భారత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫొటోగ్రాఫర్ కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. పొట్టకూటి కోసం తీవ్రంగా కష్టపడడం విజయం అయితే అనుకోని ప్రమాదాలు యాక్సిడెంట్ల రూపంలో ఎవరికైనా రావచ్చన్నారు. 18సంవత్సరాల నుంచి 65సంవత్సరాల వారు ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దన్నారు. 23వ తేదీ నుంచి తమ ఆస్పత్రిలో ప్రతి పేషెంట్‌కు యాక్సిడెంట్ పాలసీ చేయనున్నట్లు తెలిపారు.

‘రెచ్చిపోతున్న మట్టి మాఫియా’



మొరం తరలించిన ఎల్లుగ్గర్‌గుట్ట

సంగెం : మండల పరిధిలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. సెలవు దినాలు, ఆదివారం వస్తే చాలు మాఫియా కోరలు చాస్తోంది. రాత్రి కాగానే గుట్టలు, కెనాల్ గట్ల వెంట ఉన్న మొరంను తరలించి సొమ్ము చేసుకుంటున్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కెనాల్ గట్ల వెంట, ఎల్లుగ్గర్ గుట్ట చుట్టూ ఉన్న పచ్చని చెట్లను నాశనము చేసుకుంటూ మొరం దందాను కొనసాగిస్తు ప్రకృతి సంపదను దోచుకుంటున్న మట్టిమాఫియాను కట్టడి చేయాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతిపాదిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్థలంపై కన్ను

ఎల్లుగ్గర్‌రంగంపేట రెవెన్యూ పరిధిలోని నర్సానగర్ గ్రామపంచాయతీ శివారులోని 648 సర్వే నంబర్‌లో సుమారు 50ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇప్పటికే సగానికి పైగా అన్యాక్రాంతం అయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమి 50ఎకరాలకు తోడు మరో 100 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించి 150 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు చేసి కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితర అధికారులు గతంలో సందర్శించి పరిశీలించారు. వందల మందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రతిపాదిత స్థలంపై మట్టి మాఫియా కన్ను పడింది. 648 సర్వే నంబర్‌లోని భూమిలో పది ఎకరాల స్థలంలో మొరం తరలించడానికి అశ్వద్ధామ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏడీ మైనింగ్స్ వారికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్ రావు ఆ భూమిపై సర్వే నిర్వహించాలని ఆర్ఐని ఆదేశించడంతో పాటుగా ఏమైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే తెలపాలని సంబంధిత గ్రామ పంచాయతీల నోటీసు బోర్డ్ పై లేఖను అంటించారు. దీనిపై స్పందించిన నర్సానగర్ పంచాయతీ వార్డు సభ్యులు మొరం తరలింపునకు అనుమతి ఇవ్వొద్దని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సామాన్యులు ఇళ్లు నిర్మించుకోవడానికి మొరం తరలించుకోవాలంటే సవాలక్ష నిబంధనలు పెడుతున్న అధికారులు మొరం మాఫియాకు ఎలా అనుమతులు ఇస్తారని తెలిపారు. యువతీయువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పాలని పలువురు కోరుతున్నారు.